క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



వాజేడు: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పూసూరు సమీపంలో గోదావరి బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏటూరు నాగారం వైపు నుంచి వెంకటపురం(కె)కు ప్రయాణికులతో ఆటో వెళుతుంది. అదే సమయంలో అటువైపు నుంచే వచ్చిన ద్విచక్ర వాహనం ఆటోను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరికి, ద్విచక్రవాహంపై నున్న ఇద్దరికి గాయాలయ్యాయి. కాగా ఒకరికి తీవ్రగాయాలైనట్లు సమాచారం. నలుగురిని ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఇసుకను తీసుకురావడానికి వెళ్తున్న లారీ మండపాక వద్ద జాతీయ రహదారిపై నిలిపి ఉంచారు. ఇసుక లోడుతో ఏటూరునాగారం వైపునకు వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఇసుక లోడుతో ఉన్న లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా అతను పరారైనట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

ములుగు రూరల్: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని జగ్గన్నపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గన్నపేట గ్రామానికి చెందిన సంగాని రాధమ్మ (65) గత వారం రోజులగా కడుపునొప్పితో బాధపడుతుందని అన్నారు. ఉదయం ఆరు గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. కుటుంబ సభ్యులు గమనించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందిందని అన్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



ములుగు రూరల్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన ముద్దునూరుతండా పంచాయతీ పరిధి మామిడిరేవుపల్లి తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మామిడిరేవుపల్లితండాకు చెందిన గుగులోత్ బాలరాజు(35) 15 సంవత్సరాలుగా ములుగు సబ్‌స్టేషన్ నందు ఆర్టిజన్ గ్రేడ్-1 గా పని చేస్తున్నాడు. ఉదయం 7 గంటల సమయంలో కరెంట్ లేదని గ్రామంలో బొడ్రాయి వద్ద 6.3 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కు కొద్ది దూరంలో గుగులోత్ రవి ఇంటి మీద ఉన్న ఎల్‌టీ వైర్‌ను బాలరాజు చెక్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆకస్మత్తుగా రివర్స్ కరెంట్ వచ్చి అతను పట్టుకున్న వైర్‌కు కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడని తెలిపారు. ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారని తెలిపారు. మృతుడి భార్య గుగులోత్ రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ములుగు రూరల్: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండి గఫూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ములుగు ఏరియా ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధి మామిడిరేవుపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ బాలరాజ్ మృతి చెందాడని అన్నారు. గిరిజన మారుమూల గ్రామాల్లో విద్యుత్ లైన్‌లపై నుంచి 11 కేవీ లైన్ ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ట్రాన్స్ ఫార్మర్‌లకు ఆన్ ఆఫ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొర్ర రాజు, మాజీ సర్పంచ్ గుగులోత్ తిరుపతి, రత్నం ప్రవీణ్, రమేష్, దేవేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మంగపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాజేడు: ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మంగపేట: బడీడు పిల్లలందరిని వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బానోతు బాలజీ కోరారు. బాల రక్ష భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ సమన్వయంతో రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేఫ్ బ్యాక్ టు స్కూల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో గ్రామంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బానోతు బాలాజీ మాట్లాడుతూ.. అందరూ చదవాలి అందరూ ఎదగాలని బాల బాలికలు అనే వ్యత్యాసం చూపకుండా అందరిని పాఠశాలకు పంపించాలన్నారు. చదువు బాలబాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. పాఠశాల అనేది పిల్లలకు సురక్షితమైన ప్రదేశమన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రమేష్, ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, పాయం వీరనారాయణ, జమున, రాజ్యలక్ష్మి, పావని, పద్మ, సుజాత, మహాదేవి, రామారావు, నాగేంద్ర, ప్రసాద్, నాగమణి, గణేష్, శ్రీనివాస్, పోషన్న, ప్రమీల, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: ఆడపిల్లలను చదివిద్దాం, ఆడ పిల్లను ఎదుగనిద్దామని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సేఫ్ బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలందరు బడిలో ఉండాలని నినాదాలను చేశారు. అనంతరం మండల కేంద్రంలో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అందరు చదువుకోవాలని, ప్రతి ఒక్కరూ ఎదగాలని, బాల బాలికల మధ్య వ్యత్యాసం చూపకుండా పిల్లలందరిని పాఠశాలకు పంపించాలని, అది భవిష్యత్‌కు బగారు బాటలు వేస్తుందన్నారు. బాలరక్ష భారత్ ప్రతినిధి శ్రీకాంత్, ఆనందరావు, స్వరూప్ సింగ్, మల్లయ్య, ఆనంద్, రవికుమార్, శ్రీకాంత్, రాజ్య లక్ష్మి, ప్రభాకర్, రాజేష్ కుమార్, అమ్మాజిరాణి ఉన్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం చెరువు తూము మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మరమ్మతు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. చెరువు నీళ్లను ఖాళీ చేసి పనులు చేపట్టినప్పటికీ వర్షాకాలం ప్రారంభమైన పనులు పూర్తికాకపోవడంతో రైతులు అసహనానికి గురవుతున్నారని అన్నారు. తూము మరమ్మతు పనుల్లో కొంత మేరకు మాత్రమే పూర్తి అయ్యాయని అన్నారు. వర్షాలు అధికంగా కురిస్తే పనులు నిలిచి పోయే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే 19 ఫీట్ల నీళ్లను వృథాగా కిందకు వదిలారని అన్నారు. మరమ్మతు పనులు పూర్తికాని పక్షంలో ఐబీ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిరెడ్డి, చిట్టిబాబు, రామస్వామి, వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, సదానందం పాల్గొన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏటూరునాగారం: తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో సుమారు 250 మంది నమోదిత కార్మికులుండగా 40 మంది శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో సిబ్బంది రక్త, మూత్ర, బీపీ, బ్లడ్ షుగర్, థైరాయిడ్, హెచ్‌ఐవీ, ఈఎస్‌ఆర్, హెపటైటిస్ బీ, హై పటైటిస్ సీ, వీడీఆర్‌ఎల్, కేన్సర్ వంటి 16 రకాల పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.రమాదేవి, వైద్య సిబ్బంది తునికి వంశీకృష్ణ, సౌజన్య, రాంప్రకాశ్ పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

వాజేడు: మండల పరిధిలోని బిజినేపల్లి, మొరుమూరు గ్రామాల్లో మంగళవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. వాజేడు వైద్యాధికారి మహేందర్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో మొదటి విడత దోమల నివారణ మందును పిచికారీ చేశారు. అలాగే కోయ వీరాపురం గ్రామంలో మలేరియా నిర్ధారణ పరీక్షలను చేశారు. డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాశ్, వెంకటరమణ, కోటిరెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, నాగేంద్ర కుమారి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

రైతులకు నగదు చెల్లింపు

ఏటూరునాగారం: జీసీసీ కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని విక్రయించిన రైతులకు కొనుగోలు దారుడు తక్కువ డబ్బులు చెల్లించాలని ఈనెల 23న 'ధాన్యం డబ్బుల చెల్లింపులో మోసం'అనే శీర్షిక 'సాక్షి'లో ప్రచురితం అయింది. దీంతో స్పందించిన జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టారు. ఎట్టకేలకు జీసీసీ ధాన్యం కొనుగోలుదారుడు దిగి వచ్చి రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను అందజేశాడు. వసంత దుర్గారాజు, గోగు మల్లయ్య, సునారికాని భిక్షపతి, కొండగొర్ల చిన్నదుర్గయ్య, సునారికాని ఐలయ్య, జునగరి సదానందం, కొండాయి రాజులకు డబ్బులు తిరిగి ఇచ్చినట్లు రైతులు తెలిపారు. 'సాక్షి' కథనం వల్లనే అధికారులు కదిలి తమకు డబ్బులు వచ్చాయని రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

గుట్కా అమ్మితే చర్యలు తప్పవు

గోవిందరావుపేట: గుట్కా, పోగాకు ఉత్పత్తుల అమ్మకాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు పస్రాలోని కిరాణా షాపుల్లో తనిఖీ చేపట్టారు. పస్రాలోని శ్రీయ కిరాణంలో రూ.2525 విలు చేసే అంబార్ ప్యాకెట్లు లభ్యమయ్యాయని వాటిని స్వాధీనం చేసుకోని యజమాని శ్రీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత వస్తువుల అమ్మకాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



షాపుల్లో తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం దామెరవాయి గ్రామంలో జ్వాలా చారిటుబల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్‌ల ఆధ్వర్యంలో మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రస్ట్ మండల అధ్యక్షుడిగా మోరె నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పోగు నగేష్, ఇటుకారి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అప్పాజి తిరుపతి, కార్యదర్శిగా మార్క ప్రణయ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా బింకారి కార్తీక్‌లతో పాటు కార్యవర్గ సభ్యులుగా నూశెట్టి రమేష్, లోడారి సమ్మయ్య, దందేర రంజిత్, బాగె కోటేష్, లోడారి ప్రవీణ్ అద్దరి భిక్షపతి బింకారి ప్రణయ్ బాగే శ్రీహరి జాజ శ్రీనాథ్ ఎన్నుకున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ మండల కమిటీ ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అందరి అభిప్రాయాల మేరకు ఎన్నుకున్నామన్నారు. అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి త్వరలోనే జిల్లా కమిటీని ఎన్నుకుంటామన్నారు. ట్రస్ట్ సభ్యులు గోలి నరేష్, వినోద్, వంశీ, స్వామి, కృష్ణ, మనోజ్, శ్రావణ్ పాల్గొన్నారు.

'నకిలీ హక్కుపత్రాలతో రైతుబంధు'

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి పరిధిలోని దొడ్ల-కొత్తూరు గ్రామానికి చెందిన దళితుల పోడు వ్యవసాయ భూములపై కొంతమంది గ్రామానికి చెందిన ఆదివాసీలు నకిలీ హక్కుపత్రాలతో రైతు బంధు పొందుతున్నారని ఏజెన్సీ దళిత సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పరికి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొండాయి గ్రామానికి చెందిన దళితుల భూములను అక్రమంగా ఆక్రమించుకునే ప్రయత్నంలో భాగంగా నకిలీ హక్కుపత్రాలు సృష్టించి అధికారులను ప్రభుత్వాన్ని మోసం చేస్తూ రైతు బంధు పొందుతున్నారన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ దివాకరకు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. 1949 పూర్వం నుంచి దళిత కుటుంబాలు అటవీ గ్రామాలలో గిరి జనులతో మమేకమవుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. 1986లో గోదావరి వరదలు వచ్చి కొండాయి జంపన్న వాగు పొంగి గ్రామంలోనీ తమ దళితుల వ్యవసాయ భూముల్లో పూర్తిగా ఇసుకమెట్టలు వేసి జంపన్న వాగులో కలిసిపోవడం జరిగిందన్నారు. 1996 సంవత్సరంలో దొడ్ల కొత్తూరు గ్రా మానికి కట్టుబట్టలతో వచ్చి పోడు చేసుకుని సాగు చేసుకొని జీవనం గడుపుతున్నామన్నారు. ప్రస్తుతం దళితులు సాగు చేస్తున్న భూములపై అధికారులు సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కన్నాయిగూడెం: రాంబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కన్నాయిగూడెం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాసంపెల్లి రాంబాబు తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్ పాషా మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బు రమేష్, మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, మండల ఉపాధ్యక్షుడు మంగలారపు సత్యం, కటకం మల్లయ్య, మాదాస్ రాజేందర్, దాసరి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు కంకణాల నర్సయ్య తండ్రి పోషాలు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీలు గుండబోయిన నాగలక్ష్మీ అనిల్, చాప ఉమాదేవినరేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు పోషాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం



సీఐ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లను మంగళవారం తెలంగాణ మాల మహానాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి వేల్పుల సమ్మక్క, జిల్లా యూత్ అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మాదరి నరసింహారావు, ఉపాధ్యక్షుడు మాదరి రాంబాబు, నాయకులు బోడ సారయ్య, మాధురి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలుబాక (జెడ్) గల ప్రభుత్వ భూమిని గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా వలస గిరిజనేతరులకు పట్టాలు ఎలా చేస్తారని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి రెవెన్యూ ఉద్యోగుల సహకారంలో రికార్డులను తారుమారు చేస్తున్నారని అక్రమ పట్టాలను ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ఆలుబాకలో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేత్రానంద కుమార్, తాటి రాంబాబు, చంటి, సాంబశివరావు, లక్ష్మణ్, రాజు, సమ్మయ్య, గోవింద్ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారులు బాధ్యత వహించాలి



పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామ పంచాయతీకి చెందిన మల్కపల్లి గ్రామానికి చెందిన పెద్దం లక్ష్మయ్య మృతికి అటవీ శాఖ అధికారులే బాధ్యత వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పరామర్శించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. మండలంలోని గిరిజనేతరుడి భూమి చదును చేయడానికి కూలికి వెళ్లిన పెద్దం లక్ష్మయ్యపై అటవీ అధికారులు అతి ఉత్సాహం ప్రదర్శించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పోలీసులు మందలించడంతో భయంతోనే అతను ఆత్మహత్య చేసుకోని మృతి చెందినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు అవగాహన లోపంతో చేశారని వెంటనే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతని చావుకు మరో కారణమైన పోడు రైతును కూడా శిక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరం చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు



మహిళలతో వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 10 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

వాజేడు: చెంచు మహిళపై దాడి చేసిన దోషులను వెంటనే శిక్షించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన సమితి మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు అన్నారు. మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో మహిళలతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో ఆదివాసీ మహిళలపై దాడులు నిత్యకృత్యం అవుతున్నాయని అందులో భాగంగానే నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలిచింతల గ్రామంలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై ఇటీవల ఘటన చోటు చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన దోషుల్లో కొంత మందిని పోలీసులు వదిలేయగా ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈశ్వరమ్మపై దాడికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్స వెంకన్న, పర్శిక సుజాత, పద్దం పెంటమ్మ, కచ్చులపు లక్ష్మి, యర్మ జోగారావు, తాటి పవన్, కారం రాఘవి ఉన్నారు.

ఆదివాసీలను విస్మరించడం సరికాదు



మాట్లాడుతున్న పూనెం రామచంద్రరావు

వాజేడు: ఆదివాసీల ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆదివాసీ నిరుద్యోగులను విస్మరించడం సరికాదని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచంద్రరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మద్ద నర్సింహులు అధ్యక్షతన తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. 29 ప్రభుత్వ శాఖల జీఓలను కలిపి జీఓ నంబర్ మూడును చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డీఎస్సీని తక్షణమే రద్దు చేసి ఆదివాసీలకు ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించాలన్నారు. ఐటీడీఏల ద్వారా బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పూనెం సాయి చరణ్, కోరం సందీప్, పీర్ల సాయికుమార్, జాక నాగబాబు, సాయి, కృష్ణ, రాజు, గణేష్ తదితరులు ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై కృష్ణ ప్రసాద్

వాజేడు: గుడుంబా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో కాస్కో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ప్రతీ ఇంటిని పోలీసులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో దుర్గం లలిత ఇంట్లో 15 లీటర్ల గుడుంబా లభ్యం కావడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సదర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. గుడుంబాను ఎవరు విక్రయించినా, తయారు చేసినా చట్ట ప్రకారం చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.